# వరంగల్‌దే హ్యాండ్‌బాల్ టైటిల్



కొత్తపల్లి, ఫిబ్రవరి 19 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 52వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో వరంగల్, రంగారెడ్డి విజేతలుగా నిలిచాయి. మూడు రోజుల పాటు సాగిన పోటీలు సోమవారం ముగిశాయి. పురుషుల విభాగం ఫైనల్లో వరంగల్ జట్టు హైదరాబాద్‌పై అద్భుత విజయం సాధించింది. కరీంనగర్, రంగారెడ్డి వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. మహిళల తుది పోరులో రంగారెడ్డి టీమ్..వరంగల్‌పై గెలిచింది. కరీంనగర్‌కు కాంస్యం, హైదరాబాద్‌కు నాలుగో స్థానం దక్కింది. కరీంనగర్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు. విజేత జట్లకు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, రమేశ్, ప్రభాకర్ బహుమతులు ప్రదానం చేశారు.

# బుమ్రాకు విశ్రాంతి..రాహుల్ రెడీ

రాజ్‌కోట్: టీమ్‌ఇండియా ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు నాలుగో టెస్టు నుంచి విశ్రాంతినిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి రాంచీ వేదికగా.. నాలుగో టెస్టు ప్రారంభం కానుండగా.. పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని బుమ్రాకు రెస్ట్ ఇచ్చే ఆలోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. మహమ్మద్ షమీ గైర్హాజరీలో పేస్ భారాన్ని మోస్తున్న బుమ్రా.. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 81 ఓవర్లు వేసి 17 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు. ఐదో మ్యాచ్ జరగనున్న ధర్మశాల పిచ్ పేస్‌కు అనుకూలించనున్న నేపథ్యంలో.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ దృష్ట్యా జస్సీకి రెస్ట్ ఇవ్వాలని చూస్తున్నది. 'మంగళవారం జట్టు సభ్యులంతా రాంచీ వెళ్తారు. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వొచ్చు' అని బీసీసీఐ అధికారి తెలిపారు. మరోవైపు గాయం కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరమైన సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. దీంతో అతడు నాలుగో టెస్టులో బరిలోకి దిగడం ఖాయమే.



# చాంప్ ఇండీ రేసింగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐఎమ్ ప్రపంచ మోటో రేసింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ఇండీ రేసింగ్ టీమ్ విజేతగా నిలిచింది. ఒసాకా(జపాన్) వేదికగా జరిగిన సీజన్ తొలి పోరులో అరంగేట్రం టీమ్ ఇండీ రేసింగ్ పోడియం ఫినిష్ చేసింది. ఎఫ్ఐఎమ్ టోర్నీలో టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారత టీమ్‌గా ఇండీరేసింగ్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ప్రత్యర్థి రేసర్లను అధిగమిస్తూ ఇండీ రేసింగ్ తరఫున సాండ్రా గోమెజ్, స్పెన్సర్ విల్టన్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రతికూల పరిస్థితుల మధ్య రేసర్లు టాప్ గేర్‌లో దూసుకెళ్లారు. రేస్‌లో ఇండీ టీమ్ 121 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా, హోండా (132), రాబీ మ్యాడిసన్ (131) ముందువరుసలో ఉన్నాయి. పోడియం ఫినిష్ చేసిన ఇండీ రేసింగ్ టీమ్‌ను కేఎస్‌జీ యజమాని అభిషేక్‌రెడ్డి అభినందించారు.

# అధిరోహిత్

**నాన్న స్ఫూర్తితో ముందుకు ● 9 పర్వతాలు ఎక్కిన కరీంనగర్ కుర్రాడు ● ఎవరెస్ట్ లక్ష్యంగా అడుగులు**

అతడికి నాన్నే స్ఫూర్తి. ఆయన అడుగుజాడలే ఆ కుర్రాడి ఆత్మవిశ్వాసం. జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలతో తండ్రి దేశ ఖ్యాతిని దశదిశలా ఇనుమడింపజేస్తే..ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంటూ పర్వతారోహణతో శిఖర స్థాయికి తీసుకెళ్లేందుకు అలుపెరుగకుండా శ్రమిస్తున్నాడు. ఆ తండ్రి అర్జున అవార్డు గ్రహీత, పారా అథ్లెట్ మాదాసు శ్రీనివాసరావు అయితే ఆయన కొడుకు రోహిత్‌రావు. సరిగ్గా ఆరేండ్ల క్రితం కేదార్‌కాంత పర్వతంతో మొదలైన రోహిత్ అధిరోహణం ఇటీవలి కిలిమంజారోతో మరో స్థాయికి చేరింది. ఈ ఆరేండ్ల కాలంలో తొమ్మిది పర్వతాలు ఎక్కిన రోహిత్.. ఎవరెస్ట్ లక్ష్యంగా దూసుకెళుతున్నాడు. ఆర్థికంగా ఎవరైనా ఆదుకుంటే దేశ ఖ్యాతిని హిమాలయాల్లో సగర్వంగా రెపరెపలాడించేందుకు సిద్ధంగా ఉన్నా అంటున్న రోహిత్‌తో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

**పర్వతారోహణపై ఆసక్తి ఎలా ?**

నా తండ్రి మాదాసు శ్రీనివాసరావు ప్రముఖ పారా అథ్లెట్. వైకల్యాన్ని అధిగమిస్తూ అనితర సాధ్యమైన విజయాలతో దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చారు. అవయవాలు సరిగ్గా లేకపోయినా..బరిలోకి దిగిన ప్రతీ టోర్నీలో సత్తాచాటిన ఆయనే నాకు స్ఫూర్తి. వాస్తవానికి చిన్నతనంలో క్రీడల పట్ల నాకు ఆసక్తి లేదు. నాన్న శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నించినా అటువైపు మొగ్గలేదు. అయితే మంచుతో కూడిన పర్వతాలు అంటే ఊహ తెలిసిన వయసు నుంచి బాగా ఇష్టం. వాటి గురించి తెలుసుకోవాలని కుతుహలం ఉండేది. అలా పర్వతారోహణపై ఇష్టం ఏర్పడింది.

**కెరీర్ ఎప్పుడు మొదలైంది?**

సరిగ్గా ఆరేండ్ల క్రితం పర్వతారోహణ వైపు అడుగులు పడ్డాయి. నాన్నను ఆదర్శంగా తీసుకుంటూ ప్రమాదకర క్రీడగా పేరొందిన పర్వతారోహణను ఎంచుకున్నాను. తొలుత శిఖరాలకు సంబంధించిన సమాచారాన్ని ఇంటర్నెట్ ద్వారా తెలుసుకున్నాను. సరైన రీతిలో శిక్షణ లేకపోయినా ఏదైనా సాధించాలన్న కసితో ముందుకు నడిచాను. అందుకు నాన్న మంచి తోడ్పాటు అందించారు. మొదటగా 2018 డిసెంబర్‌లో హిమాలయ పర్వత సానువుల్లోని కేదార్‌కాంత (3,810మీ) పర్వతాన్ని ఎక్కాను. అక్కణ్నుంచి మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఆ తర్వాత క్రమంలో పంగర్‌చుల్లా (4,590మీ), స్టాక్ కాంగ్రీ 4,980మీ), బ్రహ్మతల్ (3,734మీ), దైరా బుగ్యాల్ (3,639మీ), జో జాంగో (6,240మీ), ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (5,364మీ), కాంగ్ యాస్టె (6,250మీ), కిలిమంజారో (5,985 మీ) ఎక్కాను. ప్రతీ ఏడాది కచ్చితంగా ఏదో పర్వతాన్ని ఎక్కాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నాను. అందుకు తగ్గట్లు ప్రణాళిక ప్రకారం ముందుకెళుతున్నాను.

**పర్వతారోహణ లక్ష్యమేంటి?**

వాస్తవానికి చిన్నతనంలో మా నాన్న బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ ఇప్పిద్దామనుకున్నారు. కానీ నాకు పెద్ద ఇష్టముండేది కాదు. తల్లిదండ్రులు ఏదో ఒకటి నేర్చుకోవాలని ఇబ్బంది పెట్టినప్పుడల్లా నేను హిమాలయాలకు పారిపోతానని వారిని బెదిరించేవాన్ని. అలా పర్వతాలపై మొదలైన నా ప్రస్థానం ఇక్కడి వరకు చేరింది. ఈ ఆరేండ్ల వ్యవధిలో ఇప్పటికి తొమ్మిది పర్వతాలు అధిరోహించాను. ఇంకా ప్రపంచంలోనే అతి ఎత్తైన ఎవరెస్ట్‌తో పాటు మిగతా వాటిని ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాను. మిగతా క్రీడలతో పోలిస్తే.. పర్వతారోహణ అనేది సాహస క్రీడ. ఏ మాత్రం అలక్ష్యం ఆవరించినా..ప్రాణాలకే ప్రమాదం. ఓవైపు ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగడం నాన్న నుంచి నేర్చుకున్నదే. ఆయన గర్వపడే విధంగా ఏదో ఒకటి చేయాలన్నదే నా లక్ష్యం.

**ఎవరెస్ట్‌పైకి ఎప్పుడు?**

2018 నుంచి ప్రతీ సంవత్సరం ఒక పర్వతం ఎక్కుతూ వస్తున్నాను. అయితే కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో 2020లో సాధ్యపడలేదు. మిగతా సంవత్సరాల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాను. ఇటీవలి టాంజానియాలోని మౌంట్ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాను. ఇందుకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చినజీయర్ స్వామి ఆర్థిక సాయం అందించారు. 2026లో ఎవరెస్ట్‌పై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను. ఇందుకోసం 40 నుంచి 50 లక్షలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ముందుకొచ్చి ఆర్థిక సాయం చేస్తే..రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా సాధిస్తానన్న గట్టి నమ్మకం నాకుంది.

**కుటుంబ నేపథ్యం?**

మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి స్వగ్రామం. అర్జున అవార్డు గ్రహీత మాదాసు శ్రీనివాసరావు మా నాన్న. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నాను. 2021లో క్యాన్సర్‌తో నాన్న తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పర్వతారోహణాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. నాన్న పేరు నిలబెట్టేలా ముందుకెళ్లాలన్నదే నా లక్ష్యం.

**రోహిత్ అధిరోహించిన పర్వతాలు**

| | |
|---|---|
| కిలిమంజారో | 5985 మీ |
| కాంగ్ యాస్టె | 6250 మీ |
| జో జాంగో | 6240 మీ |
| ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ | 5364 మీ |
| స్టాక్ కాంగ్రీ బేస్ క్యాంప్ | 4980 మీ |
| కేదార్‌కాంత | 3810 మీ |
| బ్రహ్మతల్ | 3734 మీ |
| దైరా బుగ్యాల్ | 3639 మీ |
| పంగర్‌చుల్లా | 4590 మీ |



# బ్లాక్‌హాక్స్ బోణీ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్)లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. తమ తొలి మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఓడిన బ్లాక్‌హాక్స్ సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై మెటియర్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో బ్లాక్‌హాక్స్ 7-15, 12-15, 15-10, 15-11, 20-18తో ముంబైని చిత్తు చేసింది. ఐదు సెట్ల పాటు సాగిన పోరులో తొలుత ముంబై 2-0తో మందంజ వేసినా..బ్లాక్‌హాక్స్ సంచలన ప్రదర్శనతో వరుసగా మూడు సెట్లను కైవసం చేసుకుని మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. అష్మతుల్లా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కైవసం చేసుకున్నాడు.

# గుల్వీర్‌కు గోల్డ్



టెహ్రాన్: ఆసియా ఇండోర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో గుల్వీర్ సింగ్ పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. సోమవారం జరిగిన 3000 మీటర్ల ఫైనల్ రేసులో గుల్వీర్ 8 నిమిషాల 7.48 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. నూర్ సుల్తాన్ (8:8.85 సె.; కిర్గిస్థాన్), జలీల్ నసారీ (8:9.39సె.; ఇరాన్) వరుసగా రజత కాంస్యాలు దక్కించుకున్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం కాగా.. అంతకుముందు తెలుగమ్మాయి జ్యోతి ఎర్రాజి (100 మీటర్ల హర్డిల్స్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), హర్‌మిలాన్ (1500 మీటర్ల రేసు) బంగారు పతకాలు గెలుచుకున్నారు. మరోవైపు మహిళల 3000 మీటర్ల రేసులో భారత అథ్లెట్ అంకిత రజతం గెలుచుకుంది.

# పరిమితి రూ.1 లక్ష

***పాత పన్ను డిమాండ్ల ఉపసంహరణపై సీబీడీటీ నిర్ణయం***





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: పాత పన్ను డిమాండ్ల ఉపసంహరణకు సంబంధించి ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) ఓ కీలక నిర్ణయం తీసుకున్నది. 2015-16 మదింపు సంవత్సరం వరకున్న చిన్న పన్ను డిమాండ్ల ఉపసంహరణ కోసం ఒక్కో పన్ను చెల్లింపుదారునికి పరిమితిని లక్ష రూపాయలుగా నిర్దేశించింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన పథకం ప్రకారం ఈ మేరకు స్పష్టం చేసింది. 2010-11 మదింపు సంవత్సరం కోసం రూ.25,000 వరకున్న ట్యాక్స్ డిమాండ్లను, 2011-12 నుంచి 2015-16 మదింపు సంవత్సరాల కోసం రూ.10,000 వరకున్న ట్యాక్స్ డిమాండ్లను వెనక్కి తీసుకుంటామని ఈ నెల 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటన సందర్భంగా మంత్రి సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఒక్కో పన్ను చెల్లింపుదారునికి ఈ ట్యాక్స్ డిమాండ్ల ఉపసంహరణ పరిమితిని మొత్తంగా లక్ష రూపాయలుగా నిర్ణయించినట్టు సీబీడీటీ చెప్తున్నది. అయితే ఐటీ చట్టంలోని టీడీఎస్ లేదా టీసీఎస్ కింద ట్యాక్స్ డిడక్టర్స్ లేదా ట్యాక్స్ కలెక్టర్లకు వచ్చిన డిమాండ్లకు ఈ నిర్ణయం వర్తించదు. ఇకపోతే ట్యాక్స్ డిమాండ్‌లో అసలు, వడ్డీ, జరిమానా లేదా ఫీజు, సర్‌చార్జీ అన్నీ ఈ లక్ష రూపాయల పరిమితి లెక్కలోకే వస్తాయి. కాగా, ఈ ఏడాది జనవరి 31 వరకున్న ఆదాయ పన్ను, సంపద పన్ను, బహుమతి పన్నులకు సంబంధించిన పన్ను డిమాండ్ల బకాయిలనూ ఈ లక్ష రూపాయల గరిష్ఠ పరిమితికి లోబడే పరిగణనలోకి తీసుకుంటామని సీబీడీటీ తెలిపింది.

# లగ్జరీ బ్రాండ్లలో మలబార్ గోల్డ్

- టైటాన్, కల్యాణ్ జ్యుయెల్లర్స్, జోయాలుక్కాస్‌కూ స్థానం
- టాప్-100 సంస్థల్లో భారత్ నుంచి ఆరింటికి చోటు
- డెలాయిట్ గ్లోబల్ లగ్జరీ గూడ్స్ జాబితా-2023 విడుదల

*ముంబై, ఫిబ్రవరి 19: ప్రపంచంలోని టాప్-100 లగ్జరీ బ్రాండ్లలో భారత్‌కు చెందిన ప్రముఖ ఆభరణాల తయారీ, వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు 19వ స్థానం దక్కింది. దేశీయ లగ్జరీ గూడ్స్ మేకర్లలో అగ్రస్థానంలో ఉన్నది. గత ఏడాదికిగాను సోమవారం విడుదలైన డెలాయిట్ గ్లోబల్ లగ్జరీ గూడ్స్ తయారీదారుల జాబితాలో దేశంలోని 6 కంపెనీలకు చోటు లభించింది. వీటిలో మలబార్ గోల్డ్‌తో పాటు టైటాన్, కల్యాణ్ జ్యుయెల్లర్స్, జోయాలుక్కాస్, సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్, తంగమయిల్ జ్యుయెల్లరీ ఉన్నాయి. ఇందులో 5 నగల వ్యాపార సంస్థలే కావడం విశేషం. ఫ్యాషన్ యాక్సెసరీ తయారీదారుగా టైటాన్ ఉన్నది. కాగా, టాటా గ్రూప్‌నకు చెందిన టైటాన్‌కు 24వ ర్యాంకు వచ్చింది. కల్యాణ్ జ్యుయెల్లర్స్‌కు 46వ స్థానం, జోయాలుక్కాస్‌కు 47వ స్థానం దక్కాయి. అలాగే 78వ స్థానంలో సెంకో గోల్డ్ అండ్ డైమండ్స్ ఉండగా, 98వ ర్యాంకులో తంగమయిల్ జ్యుయెల్లరీ నిలిచింది.*

***ఇదే తొలిసారి..***

*ఈ జాబితాలో మలబార్ గోల్డ్‌కు స్థానం దక్కడం ఇదే తొలిసారి. 2023లో ఈ కంపెనీ టర్నోవర్ 4 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నది. డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం ఇది దాదాపు రూ.34,000 కోట్లు. ఇక టైటాన్ టర్నోవర్ 3.67 బిలియన్ డాలర్లు. సుమారు రూ.30,000 కోట్లు. కాగా, భారత్‌లో లగ్జరీ గూడ్స్ మార్కెట్ క్రమేణా విస్తరిస్తూపోతున్నట్టు తాజా డెలాయిట్ రిపోర్టు తెలియజేసింది. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ కంపెనీలు ముమ్ముందు మరింత ప్రభావం చూపగలవని అభిప్రాయపడింది.*


- *జాబితాలో ఫ్రాన్స్‌కు చెందిన బహుళజాతి సంస్థ ఎల్‌వీఎంహెచ్‌దే అగ్రస్థానం. అమెరికాకు చెందిన పీవీహెచ్ కార్ప్ రెండో స్థానంలో, స్విట్జర్లాండ్‌కు చెందిన రిచెమోంట్ కంపెనీ మూడో స్థానంలో ఉన్నది.*
- *2023లో ఈ టాప్-100 లగ్జరీ గూడ్స్ అమ్మకందారుల టర్నోవర్ 347 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 2022తో పోల్చితే 13.4 శాతం అధికం.*
- *మొత్తం 100 సంస్థల టర్నోవర్ విలువలో ఎల్‌వీఎంహెచ్‌దే 31 శాతం.*
- *ప్రపంచ లగ్జరీ గూడ్స్ మార్కెట్‌లో 63 శాతం వాటా టాప్-10 సంస్థలదే. 2022తో చూస్తే 2023లో ఈ కంపెనీల అమ్మకాలు 23 శాతం పెరిగాయి.*
- *ఈ టాప్-100 కంపెనీల మొత్తం లాభాల్లో తొలి 10 సంస్థలదే 76.4 శాతంగా ఉన్నది.*

## వాణిజ్య

### టెస్లా పవర్‌లో 2 వేల ఉద్యోగాలు

ముంబై, ఫిబ్రవరి 19: నిరుద్యోగులకు శుభవార్తను అందించింది టెస్లా పవర్ ఇండియా. వ్యాపార విస్తరణలో భాగంగా 2 వేల మంది సిబ్బందిని నియమించుకునే యోచనలో సంస్థ ఉన్నది. ఇంజినీరింగ్, ఆపరేషన్స్, సేల్స్, మార్కెటింగ్, అనుబంధ విభాగాల్లో యువతను నియమించుకోనున్నట్లు సోమవారం ప్రకటించింది. సస్టైనబుల్ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ సేవలను అందిస్తున్న టెస్లా పవర్..ఇటీవల రిస్టోర్ బ్యాటరీ బ్రాండ్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. 2026 నాటికి దేశవ్యాప్తంగా 5 వేల రిస్టోర్ యూనిట్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ అందుకు తగ్గట్టుగానే ప్రణాళికను వేగవంతం చేసినట్లు టెస్లా పవర్ ఇండియా ఎండీ కవిందర్ ఖురానా తెలిపారు.

# రికార్డుస్థాయికి నిఫ్టీ





ముంబై, ఫిబ్రవరి 19: స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజూ లాభాల్లో ముగిశాయి. ఆర్థిక సేవలు, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు మార్కెట్లకు మరింత కిక్కునిచ్చాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మరో 281 పాయింట్లు అధికమవగా, జాతీయ సూచీ నిఫ్టీ చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 281.52 పాయింట్లు ఎగబాకి 72,708.16 పాయింట్లకు చేరుకున్నది. ఒక దశలో 72,881.93 పాయింట్లను తాకింది. చివరకు ఈ భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. 30 సూచీల్లో 17 సూచీలు లాభపడగా, 13 షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ మరో శిఖరాగ్రానికి చేరుకున్నది. 81.55 పాయింట్లు అధికమై 22,122.25 పాయింట్లకు చేరుకున్నది. ఈ స్థాయిలో ముగియడం ఇదే తొలిసారి. ఇంట్రాడేలో 22,186 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఫార్మా, బ్యాంకింగ్, చమురు రంగ షేర్లకు లభించిన మద్దతుతో నిఫ్టీ ఆల్‌టైం హైకి చేరుకున్నది.

- బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్‌లు రెండు శాతానికి పైగా ఎగబాకాయి.
- బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, నెస్లె, మారుతి, టైటాన్, రిలయన్స్, మహీంద్రా, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎన్‌టీపీసీలు ఆకట్టుకున్నాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్, టీసీఎస్, విప్రో, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్, లార్జ్ క్యాప్‌లు ఒక్క శాతం లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే టెలికం 1.52 శాతం, యుటిలిటీ 1.29 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.76 శాతం, సేవలు 1.22 శాతం, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ కంటే టాటా గ్రూపు మార్కెట్ విలువ అత్యధికంగా నమోదైంది. గ్రూపు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ 365 బిలియన్ డాలర్లు కాగా, పాకిస్తాన్ జీడీపీ 341 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

*2 లక్షల కోట్లు పెరిగిన సంపద*

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద కూడా అంతకంతకు పెరుగుతున్నది. సోమవారం మదుపరుల సంపద మరో *రూ.2,19,581.56 కోట్లు మేర పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రికార్డు స్థాయి రూ.391.69 లక్షల కోట్లు లేదా 4.72 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది.* రికార్డు స్థాయికి చేరుకున్న మార్కెట్ క్యాప్ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉన్నదని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.



## ఇక వడ్డీరేట్లు తగ్గుతాయ్!

- **రాబోయే ఆర్బీఐ సమీక్షల్లో కోతలు: గోయల్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న విశ్వాసాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నందున ఇక వడ్డీరేట్ల కోతల దిశగా ఆర్బీఐ నిర్ణయాలుంటాయన్న ఆశాభావాన్ని సోమవారం ఇక్కడ వెలిబుచ్చారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రెపోరేటును 6.5 శాతం వద్దే ఆర్బీఐ ఉంచుతున్న విషయం తెలిసిందే. అయితే ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నదని, దేశ ఆర్థిక మూలాలు సైతం బలంగా ఉన్నాయని గోయల్ అన్నారు. కాగా, రెపోరేటు తగ్గితే అటు కార్పొరేట్ రుణాలు, ఇటు వ్యక్తిగత రుణాలపై వడ్డీభారం దిగిరానున్నది. దీనివల్ల ఈఎంఐలు తగ్గుతాయి. ఏప్రిల్ 5న తదుపరి ద్రవ్యసమీక్ష నిర్ణయాలు రానున్నాయి. గత నెల రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదైంది.

# 6 వేల కోట్లతో రెన్యూసిస్ ప్లాంట్

## రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం

## పీవీ మాడ్యుల్, పీవీ సెల్ తయారీ యూనిట్

హైదరాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టడానికి మరో మరో సంస్థ ముందుకొచ్చింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో సోలార్ పీవీ మాడ్యూల్, పీవీ సెల్ తయారీ యూనిట్లను నెలకొల్పడానికి దిగ్గజ సంస్థ రెన్యూసిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో సోమవారం అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, కంపెనీ ఉన్నతాధికారులు ఒప్పంద పత్రాన్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ..ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, ఈ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు ఆకట్టుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం సమగ్ర ఇంధన పాలసీని సైతం రూపొందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్రలో రెన్యూసిస్‌కు ప్లాంట్లు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో అతిపెద్ద తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. ఈ యూనిట్‌తో హైదరాబాద్ సోలార్ పరికరాల తయారీ హబ్‌గా మారుతున్నదనే విశ్వసాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఈ ప్లాంట్‌తో వచ్చే ఐదేండ్లు కాలంలో 11వేల మందికి ఉపాధి లభించనున్నది. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో మూడు ఉత్పత్తి కేంద్రాలున్నాయి.





*మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న రెన్యూసిస్ ఉన్నతాధికారి, రాష్ట్రప్రభుత్వ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్*

**అపోలో మైక్రోసిస్టమ్‌కు భూమి పూజ..**

హైదరాబాద్‌లోని టీఎస్ఐఐసీ ఏరోస్పేస్ పార్కులో అపోలో మైక్రోసిస్టమ్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న వెపన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ యూనిట్ భూమి పూజ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అపోలో మైక్రో సిస్టమ్ యూనిట్ ఏర్పాటుతో వచ్చే మూడేండ్ల కాలంలో 400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. తెలంగాణలో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ఎన్నో పరిశ్రమలు వచ్చాయన్నారు. బోయింగ్, ఎయిర్ బస్, శాఫ్రాన్, జీఈ ఏవియేషన్ వంటి సంస్థలకు హైదరాబాద్ నిలయంగా మారిందని, ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు ఉత్తమ అవార్డులను అందుకుందని వివరించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.